కళకళలాడుతున్న కాటన్ పార్కు

- పెరిగిన పర్యాటకుల సంఖ్య
- రూ.1.14 కోట్లుతో పార్కు అభివృద్ధి పనులు పూర్తి


పిల్లల ఆటపాటలతో కళకళలాడుతున్న కాటన్‌పార్కు

నరసాపురం: పట్టణంలోని రైల్వేస్టేషన్‌రోడ్డులో ఉన్న కాటన్‌పార్కు పర్యాటకులతో కళకళలాడుతోంది. గత పాలకుల నిర్లక్ష్యంతో పూర్తిగా మూతపడ్డ పార్కును రూ.1.14 కోట్లతో అభివృద్ధి చేశారు. దీంతో ఈ వేసవిలో ఉదయం, సాయంత్రపు వేళల్లో పార్కుకు వచ్చే సందర్శకుల సంఖ్య బాగా పెరిగింది. పార్కులు అభివృద్ధి లేక ఇంతకాలం ఆహ్లాదానికి నోచుకోకుండా ఉన్న పట్టణ వాసులు కాటన్‌పార్కు అభివృద్ధితో ఆనందపడుతున్నారు. పట్టణంలో రెండు ప్రధాన పార్కులు ఉన్నాయి. ఇందులో ఒకటి కాటన్ పార్కు కాగా, మరొకటి శారదా థియేటర్ వద్ద బాలయ్యపార్కు. కాటన్‌పార్కు శిథిలమై దాదాపు మూతపడే స్థితికి వచ్చింది. దీంతో ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు దృష్టి పెట్టి పార్కు అభివృద్ధికి చర్యలు చేపట్టారు. ప్రణాళికా అభివృద్ధి సంఘం నిధులు కేటాయించేలా కృషిచేశారు. మున్సిపాలిటీ కూడా కొంతమేర జనరల్ ఫండ్స్ కేటాయించి పార్కును సత్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

మారిన పార్కు రూపురేఖలు

భారీగా నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టడంతో పార్కు రూపురేఖలు పూర్తిగా మారాయి. రూ.48.26 లక్షలు 14వ ఆర్థికసంఘ నిధులతో పార్కులో సుందరీకరణ పనులు చేశారు. రూ.12.50 లక్షలు మున్సిపల్ జనరల్ ఫండ్స్‌తో ఆటవస్తువులు, టాయిలెట్స్ నిర్మించారు. రూ.9.39 లక్షలు 15వ ఆర్థిక సంఘం నిధులతో మొక్కలు, బ్యూటిఫికేషన్ వర్క్ చేస్తున్నారు. మరో రూ.11.73 లక్షలు 15వ ఆర్థిక సంఘ నిధులతో పార్కులో ప్లాట్‌ఫామ్ మొత్తం ఆధునికీకరిస్తున్నారు. రూ.19.50 లక్షలు మున్సిపల్ జనరల్ ఫండ్స్‌తో లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. రూ.19 లక్షలు మున్సిపల్ జనరల్ ఫండ్స్‌తో బస్టాండ్ ఎదురుగా ఉన్న 216 జాతీయరహదారి నుంచి నేరుగా పార్కుకు చేరుకోవడానికి నిడదవోలు-నరసాపురం కాలువపై కాలిబాట వంతెన నిర్మిస్తున్నారు. వంతెన పనులు కూడా దాదాపు పూర్తి కావచ్చాయి.

పార్కులు అభివృద్ధి చేస్తాం



కాటన్‌పార్కు అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. దీంతో ఈ వేసవిలో పర్యాటకుల సంఖ్య పెరిగింది. పార్కులో ఇంకా సౌకర్యాలు ఏర్పాటు చేస్తాం. పార్కు ఎదురుగా కలువపై వంతెన నిర్మాణ పనులు కూడా పూర్తయ్యాయి. 216 జాతీయ రహదారి నుంచి నేరుగా పార్కుకు చేరుకోవచ్చు. గత పాలకులు పార్కు అభివృద్ధికి రూపాయి కూడా ఖర్చుపెట్టలేదు. దీంతో పార్కు శిథిలమై మూతపడింది. మా హాయంలో పార్కుల అభివృద్ధిపై దృష్టి పెట్టాం. ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ప్రత్యేక దృష్టి పెట్టారు.

– బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ చైర్‌పర్సన్

నేడు పూలపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం

పాలకొల్లు అర్బన్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 7 గంటలకు పూలపల్లి శ్రీ గంటాలమ్మ గుడి వద్ద నుంచి ప్రారంభించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ ఎం.మైఖేల్‌రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే దగ్గులూరులో ఉదయం 11 గంటలకు జలజీవన్ మిషన్ వాటర్ వర్క్స్ పనులు ప్రారంభిస్తారని వివరించారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాలకొల్లు అర్బన్: మండలంలోని లంకలకోడేరు 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ వెలివెల ఫీడర్‌లో శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు దగ్గులూరు, బల్లిపాడు, శివదేవునిచిక్కాల, సానివాడ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఎలక్ట్రికల్ డివిజనల్ ఇంజనీర్ బళ్ల సురేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ స్తంభాల మార్పు, విద్యుత్‌తీగలకు అడ్డు వస్తున్న కొబ్బరి చెట్ల తొలగింపు తదితర సాంకేతిక మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని వివరించారు.

క్లుప్తంగా

నరసాపురం ఎంఈఓ-2గా జాన్ ప్రభాకర్


జాన్ ప్రభాకర్

నరసాపురం రూరల్: మండల విద్యాశాఖాధికారి-2గా జి.జాన్ ప్రభాకర్ బాధ్యతలు చేపట్టారు. యలమంచిలి మండలం ఏనుగువానిలంక హైస్కూల్లో హెచ్‌ఎంగా బాధ్యతలు నిర్వహిస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా పదోన్నతిపై ఇక్కడికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు సీఆర్పీలు, కార్యాలయ సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

జగనన్న కాలనీ సందర్శన


జగనన్న కాలనీవాసులతో మాట్లాడుతున్న హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు

యలమంచిలి: మండలంలోని అడవి జగనన్న కాలనీని గురువారం హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో పెద్దిరాజు మాట్లాడుతూ గత నాలుగేళ్లలో వారి జీవితాల్లో వచ్చిన మార్పును గురించి ప్రశ్నించగా మహిళలంతా పై విధంగా స్పందించారు. ఈ కాలనీలో విశాలమైన రోడ్లు, విద్యుత్, తాగునీరు వసతి ఉందని ఇక డ్రయిన్స్ నిర్మిస్తే గేటెడ్ కమ్యూనిటీ భవనాల మాదిరిగా ఉన్న జగనన్న కాలనీలో హాయిగా జీవిస్తామని మహిళలు చెప్పగా, పెద్దిరాజు స్పందిస్తూ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి డ్రయిన్స్ నిర్మాణానికి కృషి చేస్తానని చెప్పారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ మారుమూల గ్రామం వెళ్లినా ప్రజా స్పందన ఈ విధంగానే ఉందన్నారు. పెద్దిరాజు వద్ద నరమామిడి దుర్గాభవా, మురపాక రమాదేవి ప్రభుత్వ పాలనలో జరిగిన సంక్షేమంపై హర్షం వ్యక్తం చేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ అడవిపాలెం గ్రామ కమిటీ అధ్యక్షుడు బుంగా జయరాజు, పాలకొల్లు రూరల్ వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సబ్బే శ్రీను, పోడూరు మండలం ఎస్సీ సెల్ అధ్యక్షుడు వడ్లపాటి సురేష్, వేడంగి సొసైటీ డైరెక్టర్ ఆకుమర్తి సుగుణరాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజలకు సేవలందించాలి


జగనన్న సురక్ష సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: జగనన్న సురక్షతో సంక్షేమ పథకాలు ప్రజలకు మరింతగా చేరువ చేయాలని పెనుగొండ మండల సచివాలయ కన్వీనరు సాక సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం పెనుగొండ సచివాలయంలో కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జగనన్న సురక్షపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ప్రతి ఇంటికి వెళ్లి వారికందుతున్న సంక్షేమ పథకాలు, అర్హత, ఎవరికైనా ఆగి ఉంటే అడ్డంకులు తొలగించడానికి తీసుకోవాల్సిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పెనుగొండ గ్రామ సర్పంచ్ నక్కా శ్యామలా సోనీ, ఎంఎల్‌ఓ నారాయణ రెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు తిక్కిరెడ్డి పవన్‌కుమార్, నూలి పవన్, దుర్గారావు పాల్గొన్నారు.

పీఎల్ రాజుకు ఘన నివాళి


పీఎల్‌రాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పోడూరు: స్వయంశక్తితో ఉన్నతస్థానానికి ఎదిగి పారిశ్రామికవేత్తగా, దాతగా పేరుగాంచిన చక్రథా రిటబుల్ ట్రస్ట్ అధినేత పీఎల్ రాజు అందరికీ ఆదర్శప్రాయుడని ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్ కొనియాడారు. జిన్నూరులో పెన్మెత్స సీతమ్మ మెమోరియల్ ఆసుపత్రి భవనంలో గురువారం అల్లూరి సీతారామరాజు సేవాసమితి ఆధ్వర్యంలో పీఎల్ రాజు సంతాప సభను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ సుమంగళి సాగర్, సొసైటీ చైర్మన్ డీటీడీసీ బాబు, సర్పంచ్ జమ్ము బేబీమహలక్ష్మి తదితరులు పీఎల్‌రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు క్షత్రియ పరిషత్ అధ్యక్షులు భూపతిరాజు విశ్వనాథరాజు, సొసైటీ మాజీ చైర్మన్లు పెన్మెత్స రాము, పెన్మెత్స సుబ్బరాజు, ఉప సర్పంచ్ దండు వెంకట గోపాలకృష్ణంరాజు, సీనియర్ సిటిజన్లు తాళాబత్తుల గాంధీ, పెన్మెత్స బాబూశ్రీ, మాజీ ఎంపీపీ దాసరి రత్నంరాజు, మాజీ ఎంపీటీసీలు పాలవలస తులసీరావు, భూపతిరాజు సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

ముగిసిన మావుళ్లమ్మ జాతర

పెనుగొండ: సిద్ధాంతం గ్రామ దేవత మావుళ్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా ముగిశాయి. ముగింపు సందర్భంగా గురువారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. సుమారు 5 వేల మందికి అన్న సమారాధన నిర్వహించారు. వారం రోజులుగా మావుళ్లమ్మ ఫ్రెండ్స్ యూనియన్, ఆలయ పునర్నిర్మాణ కమిటీల ఆధ్వర్యంలో ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు


లక్ష్మణేశ్వరంలో రహదారి నిర్మాణ పనుల వద్ద అధికారులకు సూచనలు ఇస్తున్న చీఫ్‌విప్ ప్రసాదరాజు

నరసాపురం: వ్యక్తిగత స్వార్థంతో, కుయుక్తులతో చేసే విమర్శలు తాను పట్టించుకోనని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. గురువారం సాయంత్రం ముదునూరి తన కార్యాలయంలో నరసాపురం మండల పార్టీ బూత్ కన్వీనర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సుపరిపాలన అందిస్తున్నారని అన్నారు. పేదవారి బతుకుల్లో వెలుగులు నింపే విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. పేదల పిల్లలు చదవుకోవడానికి డబ్బులు వేస్తున్నారని, మహిళలు ఆర్థికంగా అభివృద్ధిచెందాలని డబ్బులు బ్యాంకు ఖాతాల్లో వేస్తున్నారని చెప్పారు. పేదలకు డబ్బు ఇస్తుంటే ప్రతిపక్షాలు పెడార్థాలు పెడుతుందని విమర్శించారు. నరసాపురం మండలంలో 12 వేల మందికి ఇళ్లపట్టాలు అందించన ఘనత మన ప్రభుత్వానిదన్నారు. పార్టీకి బూత్ కన్వీనర్లు కీలకమన్నారు. బూత్ కన్వీనర్లు కష్టపడి పార్టీ కోసం పనిచేయాలని చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు దొంగ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణాలకు అధిక ప్రాధాన్యం

నరసాపురం రూరల్: నియోజకవర్గంలోని రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్లు చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు పేర్కొన్నారు. మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామం మల్లిపూడి మెరకవద్ద రూ.20 కోట్ల నిధులతో నిర్మించనున్న లక్ష్మణేశ్వరం నుంచి ఎల్బీచర్ల మీదుగా పెదమైనవానిలంక వెళ్లే రహదారి నిర్మాణ పనులకు ఆయన గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరసాపురం మండలానికి వెన్నెముక అయినటువంటిదిగా ఈ రహదారిని అభివర్ణించారు. సుమారు 16 గ్రామాలను అనుసంధానం చేసే ఈ రహదారిని అభివృద్ధి చేయడం వల్ల ప్రజలకు చాలా మేలు జరుగుతుందన్నారు. ఈ ఏడాది నియోజకవర్గంలో రూ.70 కోట్ల నిధులతో 12 ఆర్ అండ్‌బీ రహదారులు నిర్మిస్తున్నామని, లక్ష్మణేశ్వరం- పీఎం లంక రహదారి తో కలపి 4 రహదారుల పనులు నిర్మాణంలో ఉన్నాయని, మిగిలిన రహదారులు టెండర్ల ప్రక్రియ పూర్తిచేసుకుని త్వరలోనే నిర్మాణాలు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. నరసాపురం, మొగల్తూరు జాతీయ రహదారిలో ఉన్న లూథరన్ చర్చి వద్దనుండీ లక్ష్మణేశ్వరం గోపురం వరకూ ఉన్న ఆర్అండ్‌బీ రహదారిని కూడా వెడల్పుచేసి నిర్మించాలన్న ఉద్దేశంతో రూ.4 కోట్లు నిధులు మంజూరు చేయించానన్నారు. రూ.3 కోట్లతో లక్ష్మణేశ్వరం నుంచి రామన్నపాలెం మీదుగా పీతానిమెరక గ్రామం వరకూ రహదారి పనులు చేపట్టామన్నారు. ఇప్పటికే రామన్నపాలెంలో బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయ్యాయన్నారు. రూ.2.5 కోట్లతో వైఎస్‌పాలెం వద్ద రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. గతేడాది మండలంలోని గొంది- చిట్టవరం, మల్లవరం- లిఖితపూడి, కొప్పర్రు-సీతారామపురం రహదారులకు నిర్మాణం జరిగిందన్నారు. నియోజకవర్గంలోని రహదారుల అభివృద్ధికి ఎక్కువ నిధులు మంజూరు చేసుకుని పనులు సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తామని ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్‌నాయుడు, ఎంపీటీసీ కోలపర్తి రామకృష్ణ, సర్పంచ్ తిరుమాని వెంకట్రాజు, ఆర్అండ్‌బీ డీఈ జీవీఎస్ కిరణ్ కుమార్, ఏఈ నిక్కీక్రజ్, దొంగ మురళీకృష్ణ, చాగంటి సత్యనారాయణ, మత్తే సువర్ణరాజు, కడలి శ్రీను, సుగుణరావు, పెమ్మాడి సుధాకర్, ముద్దాల సురేష్, అర్జున్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ


పాలకొల్లులో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ-2 శర్మ

పాలకొల్లు సెంట్రల్: ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విద్య కార్పొరేట్ స్థాయి విద్యను మించి మెరుగైన విద్య అందుతుందని మండల విద్యాశాఖ అధికారి-2 ఆర్ఎస్‌వీఎస్ జి శర్మ అన్నారు. గురువారం స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో నోట్ పుస్తకాలు పంపిణీ చే శారు. ఈ సందర్భంగా ఎంఈఓ శర్మ మాట్లాడుతూ దాతల సహకారం మరువలేనిదని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీప్రసాద్, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ తోకల జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

చించినాడలో..

యలమంచిలి: చించినాడ పంచాయతీ ఆర్లపాడులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పాలకొల్లుకు చెందిన అంబేడ్కర్ సేవా సమితి సభ్యులు నోటు పుస్తకాలు, కుర్చీలు పంపారు. వాటిని సర్పంచ్ దంగేటి రాజమణి, ఉప సర్పంచ్ రుద్రరాజు చిన్నాల చేతుల మీదుగా గురువారం విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజమణి మాట్లాడుతూ విద్యాభివృద్ధికి దాతల సహకారం అవసరమన్నారు. ప్రధానోపాధ్యాయుడు అడ్డాల నాని పాల్గొన్నారు.

నేడు చీఫ్‌విప్ ముదునూరి షెడ్యూల్ ఇలా

నరసాపురం: ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు శుక్రవారం ఉదయం 9.30 గంటలకు బస్టాండ్‌లో రూ.80 లక్షలతో చేపట్టనున్న డిపో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. ముందుగా శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేస్తారు. ఉదయం 11.30 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో జరిగే జగనన్న సురక్ష ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు.

అందేవారి బోదె ఆక్రమణలపై త్వరలో సర్వే

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని అందేవారి బోదే ఆక్రమణపై త్వరలో సర్వే చేయిస్తామని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. గురువారం హైదరాబాద్ నుంచి ఆయన ఫోన్‌లో స్థానిక విలేకరులతో మాట్లాడారు. సర్వే పూర్తయిన తర్వాత ఆక్రమణల తొలగింపుకు రెవెన్యూ, నగర పంచాయతీ అధికారులు చర్యలు చేపడతారన్నారు. ఆక్రమణదారులు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదన్నారు. పార్టీ రహితంగా, పారదర్శకంగా ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటామన్నారు. గత కొన్నేళ్లుగా ఈ ప్రాంతం ఆక్రమణకు గురైన విషయం ప్రజలకు తెలుసని, గత పాలకుల అండదండలు, నాయకుల ప్రోద్బలం, అధికార దాహంతో కొంతమంది ఆక్రమణలకు దిగారని పీవీఎల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ లబ్ధి కోసం ఆక్రమణలను అడ్డుపెట్టుకోవడం దురదృష్టకరమన్నారు. అందేవారి బోదే, గంగానమ్మకోడు, మూలలంక పంట మురుగు కాలువల అభివృద్ధికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి ప్రత్యేక నిధుల మంజూరు కోసం తీవ్రంగా కృషి చేస్తున్నామని పీవీఎల్ వివరించారు.


ప్రతిభకు చిరునామాగా ప్రభుత్వ పాఠశాలలు

ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్


జిన్నూరు జెడ్పీహైస్కూల్లో అవార్డులు అందిస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

పోడూరు: సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల ప్రతిభకుచిరునామాకు నిలుస్తున్నాయని ఎమ్మెల్సీ, పాలకొల్లు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ అన్నారు. జమ్ము నిఖిలేష్ 22వ జయంతి సందర్భంగా జిన్నూరు గ్రామంలోని ఏఎస్ఆర్ జెడ్పీహైస్కూల్లో నిఖిలేష్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులు, సర్టిఫికేట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 537 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిన యర్రంశెట్టి పవన్‌వెంకటసాయి కు రూ.10వేల నగదు, 460 మార్కులతో రెండవస్థానంలో నిలిచిన బొంతు నీరజ్‌కు రూ.7500 నగదు, 449 మార్కులతో మూడవస్థానంలో నిలిచిన కేతా జ్యోతిష్మాకు రూ.5 వేల నగదు తో పాటు నిఖిలేష్ మెమోరియల్ ప్రతిభా అవార్డులను ఎమ్మెల్సీ శ్రీనివాస్, నిఖిలేష్ తల్లిదండ్రులు అయిన సర్పంచ్ జమ్ము బేబీ మహలక్ష్మి, ఏఎంసీ డైరెక్టర్ జమ్ము మృత్యుంజయరావు చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్సీ శ్రీనివాస్ మాట్లాడుతూ సర్పంచ్ బేబీ మహలక్ష్మి, మృత్యుంజయరావు దంపతులు ఛారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి సేవాకార్యక్రమాలు నిర్వహించడం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, సొసైటీ చైర్మన్ డీటీడీసీ బాబు, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ అధ్యక్షులు ఉచ్చుల స్టాలిన్, హెచ్‌ఎం సీహెచ్ శివజ్యోతి, ఎంపీటీసీ సభ్యులు భూపతిరాజు సరస్వతి, కడలి పద్మావతి, ఉపసర్పంచ్ దండు వెంకట గోపాలకృష్ణంరాజు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి


శేరేపాలెం సచివాలయంలోని రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ బాబ్జిరాజు

మొగల్తూరు: సచివాలయ ఉద్యోగులు ప్రతీ ఒక్కరూ సమయపాలన పాటించాలని ఎంపీడీఓ బాబ్జిరాజు ఆదేశించారు. గురువారం మండలంలోని శేరేపాలెం, కొత్తపాలెం గ్రామాల్లోని సచివాలయాలను సందర్శించి హాజరు పట్టీని పరిశీలించారు. సమయానికి రాని ఉద్యోగులను మరోసారి ఆలస్యంగా వస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సచివాలయంలోని రికార్డులను తనిఖీ చేసి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను తెలిపే వివరాలను, లబ్ధిదారుల వివరాలను నోటీస్ బోర్డులో ఉంచాలని సూచించారు. అదే గ్రామంలో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులను పరిశీలించారు. ఆయన వెంట కార్యదర్శి కేఐఎస్ రాజు తదితరులు ఉన్నారు.

సీసీఆర్‌సీ కార్డు పంపిణీలో నిర్లక్ష్యం వద్దు


పోడూరులో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు

పోడూరు: కౌలు రైతులకు గుర్తింపు కార్డుల పంపిణీలో ఎలాంటి నిర్లక్ష్యం వహించ వద్దని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు వీఆర్‌ఓలను, వీఏఏలను ఆదేశించారు. పోడూరు ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఆయన వీఆర్‌ఓలు, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్(వీఏఏ)లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కౌలురైతుల గుర్తింపుకార్డులు, మట్టి నమూనా పరీక్షలు, పీఎం కిసాన్ యోజన ఈకేవైసీ అంశాలపై ఆయన వారితో చర్చించారు. కౌలురైతులంతా గుర్తింపు కార్డులు పొందేలా వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది కృషి చేయాలన్నారు. ఇప్పటివరకు గ్రామాలవారీగా ఎంతమంది కౌలురైతులకు గుర్తింపుకార్డులు ఇచ్చారో? సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మట్టినమూనాలు త్వరగా సేకరించి ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలని వీఏఏలను ఆదేశించారు. ఇప్పటివరకూ కూడా పీఎం కిసాన్ యోజనకు ఈకేవైసీ చేయించుకోని రైతులను గుర్తించి త్వరగా ఆ ప్రక్రియ పూర్తి చేయించాలన్నారు. ఈ సమావేశంలో పాలకొల్లు ఏడీఏ ఎ.పార్వతి, తహశీల్దార్ ఆర్వీ కృష్ణారావు, ఎంపీడీఓ డి.సుహాసిని, మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ, ఆర్ఐ కె.రాంబాబు, ఏఈఓ ప్రియాంక పాల్గొన్నారు.

పాలకొల్లులో

పాలకొల్లు అర్బన్: కౌలు రైతులందరికీ తక్షణం పంట సాగుదారుని ధ్రువీకరణ పత్రం (సీసీఆర్‌సీ కార్డులు) అందజేయాలని జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావు కోరారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకొల్లు మండలంలోని 27 గ్రామాల్లో గుర్తించిన 3018 మంది కౌలు రైతులకు మూడు, నాలుగు రోజుల్లో అందించాలని సూచించారు. సీసీఆర్‌సీ కార్డులు కౌలు రైతులకు లేకపోతే ప్రభుత్వం ఇచ్చే రాయితీలు అందవన్నారు. సార్వా సీజన్‌కి సంబంధించి సేకరించిన 456 మట్టి నమూనాలను భూసార పరీక్షా కేంద్రం, తాడేపల్లిగూడెం పంపించి నివేదికలు రప్పించి తదనుగుణంగా రైతుల పంట పొలాలకు ఎరువులు సిఫార్సు చేయాలన్నారు. అలాగే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్న 1395 మంది రైతులకు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్దకు రైతులను రప్పించి ఓటీపీ లేదా బయోమెట్రిక్, ఫేస్ యాప్ ద్వారా పూర్తి చేయాలని ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ పెద్దిరాజు, ఏడీఏ అడ్డాల పార్వతి, మండల వ్యవసాయాధికారి కె రాజశేఖర్ పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదల జీవన ప్రమాణాలు మెరుగు


పూలపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నవరత్నాల బ్రోచర్‌ను అందిస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: నవరత్నాల పథకాల ద్వారా పేద,మధ్య తరగతి వర్గాలకు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతీ ఒక్కరూ ఆశీర్వచనాలు అందించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. పాలకొల్లు మండలం పూలపల్లిలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు ఏ విధంగా అందుతున్నాయో లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు చేయని వలంటీర్ వ్యవస్థ, సచివాలయ వ్యవస్థ అమలు చేసి సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసిన ఘనత సీఎం జగన్‌కి దక్కుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజల మేలు కోరిన వ్యక్తిగా సీఎం జగన్ ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. దగ్గులూరులో రూ.475కోట్లతో మెడికల్ కళాశాల పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు మసిపూసి మారేడుకాయ చేసి ప్రజలను మభ్యపెట్టారని ఆరోపించారు. ఎమ్మెల్యే నిమ్మల చేపట్టిన పనులన్నీ సగంలోనే నిలిచిపోయాయని విమర్శించారు. అభివృద్ధి పేరుతో కమీషన్లు దండుకున్నారని దుయ్యబట్టారు. ముస్లిం వీధిలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. దీనిపై ఎమ్మెల్సీ శ్రీనివాస్ స్పందిస్తూ ఎలక్ట్రికల్ ఏఈకి ఫోన్ చేసి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు. తెల్లవారకుండానే ఇంటికి తీసుకువచ్చి పింఛన్ అందజేస్తున్న సీఎం జగన్ పాలన ఎంతో బాగుందని వృద్ధుడు గంటి సత్యనారాయణ ఆనందం వ్యక్తం చేశారు. అలాగే తనకు అమ్మ ఒడితో పాటు ఇంటి స్థలం ఇచ్చిందని, తన తండ్రికి పింఛన్ వస్తోందని బండి లక్ష్మి ఆనందం వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజులనాయుడు, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, మండల పరిషత్ మాజీ ప్రతిపక్షనేత చిట్టూరి ఏడుకొండలు, పార్టీ మండల కన్వీనర్ ఎం మైఖేల్‌రాజు, పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, పట్టణ యూత్ అధ్యక్షుడు మానుకొండ శ్రీనుబాబు, పార్టీ నాయకులు మద్దా చంద్రకళ, కుంచిలపల్లి వినిస్టన్‌బాబు, ఉచ్చుల స్టాలిన్, గ్రామ కమిటీ అధ్యక్షుడు దొమ్మేటి శ్రీనివాస్, గ్రామ పార్టీ నాయకులు ఉనికిలి శ్రీనివాస్, ఉనికిలి పెద్దిరాజు, పితాని మురళి, గంటా వెంకన్న, అన్నవరపు వెంకటరమణ, కోళ్ల వెంకట్, దొమ్మేటి లోకేష్, కడలి ఆంజనేయులు, కోట నాగబాబు, ఈద శ్యామ్, పొనుకు దైవకృప తదితరులు పాల్గొన్నారు.